




మెరుగైన పారిశుధ్యం నిర్వహణకు సహకారం



నెల్లూరు : క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో వాహనాలకు తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. శనివారం పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా 5వ డివిజన్ జాకీర్ హుస్సేన్ నగర్, సత్యనారాయణ పురం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలో కుక్కల సంచారం ఎక్కువగా ఉందన్న ఆ సమస్యపై స్థానికుల ఫిర్యాదును కమిషనర్ పరి శీలించారు. వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్, నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ , సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

'మీ రుణం తీర్చుకుంటా'..!

○నెల్లూరులో ముగిసిన యువగళం..!
○31 రోజులు నారా లోకేష్ పాదయాత్ర
○నేతల ఘన వీడ్కోలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

టిడిపి యువనేత నారా లోకేష్ పాదయాత్ర ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ముగిసింది. గత నెల 13న ఆయన ఆత్మకూరు నియోజకవర్గంలో నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించారు. 31 రోజులపాటు పది నియోజకవర్గాల్లో పాదయాత్ర పూర్తి చేశారు. వైసిపి బహిష్కరించిన ఎంఎల్ఎ ఆనం రామ నారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు నారా లోకేష్ పాదయాత్రకు ఘన స్వాగతం పలికి ఏర్పాట్లు చేయ డంతో పాదయాత్ర మరింత ఉత్సహంగా సాగింది. నెల్లూరు నుంచి మాజీ మంత్రి నారాయణ పాదయాత్రలో పాల్గొ న్నారు. ఇదే సమయంలో వైసిపి నేతల అవినీతి, అక్రమాలపైనా విమర్శలు చేయడంతో లోకేష్ పాదయాత్ర ప్రత్యేకతను సంతరించుకుంది. శనివారం సాయంత్రం రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద నెల్లూరు జిల్లా సీనియర్ నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. వారికి లోకేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

టిడిపి యువనేత నారా లోకేష్ పాదయాత్ర టిడిపి నేతలు, కార్యకర్తల్లో జోష్ నింపింది. గతనెల 13న ఆత్మకూరు నియోజ వర్గంలోకి ప్రవేశించారు. అక్కడ నుండే వైసిపి ఎంఎల్‌ఎలపై విమర్శలు ఎక్కుపెట్టారు. ఏ ఒక్కరిని వదలిపెట్టడం లేదు. ఒక వైపు ప్రజలతో మాట్లాడుతూ, అన్ని వర్గాల్లో సదస్సులు ఏర్పాట్లు చేసి, తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా లోకేష్‌ను చూడడానికి ఆసక్తి చూపారు. ఇదిలా ఉంటే వైసిపి నుండి బయటకు వచ్చిన ఎంఎల్‌ఎలు ఆనం రామ నారాయణరెడ్డి , కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి టిడిపిలో చేరారు. లోకేష్ పాదయాత్రకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. పది నియోజకవర్గాల్లో ఒకరిని మించి ఒకరు ఏర్పాట్లు చేశారు. ఇదంతా టిడిపి నేతలకు కొత్త ఉత్సహాన్ని ఇచ్చింది. వైసిపి నేతలపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. ఆత్మకూరు ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గానికి ఏం చేయలేదని, ఇక్కడకొచ్చిన పరిశ్రమలు పక్క జిల్లాలకు వెళ్లిపోతున్నాయంటూ విమర్శలు చేశారు. ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి ఆయనపై ప్రతి విమర్శలు చేశారు. ఆత్మకూరు అభివృద్ధి మా ద్వారానే జరిగిందని చెప్పారు. అక్కడ నుంచి వెంకటగిరి నియోజకవర్గానికి వెళ్లిన ఆయన ఎంఎల్‌ఎపై విమర్శలు చేయలేదు. ఆనం రామనారాయణ రెడ్డి టిడిపిలో చేరారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎంఎల్‌ఎపైనా విమర్శలు చేశారు. గూడూరులో అగుడుపెట్టిన ఆయన స్థానిక ఎంఎల్‌ఎ వరప్రసాద్‌ను వదలలేదు. ఆయన అవినీతి, సిలికా దందా వంటి అంశాలపై విమర్శలు చేశారు. సూళ్లూరుపేట, గూడూరు ఎంఎల్‌ఎలు ప్రతి విమర్శలు జోలికి వెళ్లలేదు. సర్వేపల్లిలో అడుగుపెట్టడంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి, అక్రమాల తోపాటు, కోర్టు దొంగ అంటూ విమర్శలు చేయడంతో మంత్రి కాకాణి సైతం అదే స్థాయిలో ప్రతి విమర్శలు చేశారు. ఒక దశలో ఏక వచనంలో మాట్లాడడంతో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శలకు దిగారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ హెచ్చరించారు. టిడిపి అదికారంలోకి వస్తే సిట్ వేస్తానని చెప్పారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ జోలికి వెళ్లలేదు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టిడిపిలో చేరడంతో ప్రభుత్వ విధానాలపైనే మాట్లాడారు. నెల్లూరు నగరంలో నారా లోకేష్ విమర్శలు దుమారమే లేపాయి. అనిల్‌కుమార్‌యాదవ్ సుమారు రూ వెయ్యి కోట్లు అక్రమ సంపాదన చేశారని, అధారాలున్నాయని బయటపెట్టారు. అనిల్ తీవ్ర స్థాయిలో విమర్శలకు దిగారు. లోకేష్ ఆదారాలు బయటపెట్టారు. కోవూరు నియోజ కవర్గంలో బుచ్చిరెడ్డిపాళెంలో ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రూ 1500 కోట్లు అవినీతి చేశారంటూ విమర్శలు చేశారు. అందుకు ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రతి విమర్శలు చేసి, అరే, అనడంతో టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



నారా లోకేష్‌కు వీడ్కోలు పలుకుతున్న ఉమ్మడి నెల్లూరు జిల్లా నేతలు

ఘనంగా వీడ్కోలు....!

టిడిపి నేత నారా లోకేష్‌కు సీనియర్ నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. రాళ్లపాడు వద్ద సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామ నారా యణరెడ్డి, పన బాక లక్ష్మీ, పనబాక కృష్ణయ్య, బొల్లినేని రామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ముఖ్యనేతలు వీడ్కోలు పలికారు. మీ రుణం తీర్చుకుంటా.. పార్టీ అధికారంలో వచ్చాక చెప్పినవన్నీ చేస్తానని లోకేష్ చెప్పారు.



నారా లోకేష్‌కు వీడ్కోలు పలుకుతున్న ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డి

లోకేష్‌కు ఉమ్మడి 'ప్రకాశం' ఘన స్వాగతం



నారా లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు

ప్రజాశక్తి -లింగసముద్రం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఉమ్మడి ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. శనివారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో నారా లోకేష్ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోకి అడుగుపెట్టారు. కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, టిడిపి నాయకులు కార్యకర్తలు పెంట్రాల పంచాయతీలో పరిధిలోని కొత్తపేట గ్రామం, రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద భారీ గజమాలతో, మేళ తాళాలు డప్పు శబ్దాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మహిళలతో మాట్లాడారు భారీ జన సందోహం మధ్య యువగలం పాదయాత్ర సాగింది. పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు పాదయాత్రకు రావడంతో రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డు జనంతో నిండిపోయింది. పెంట్రాల, జంపాల వారి పాలెం, వాకమల్ల వారి పాలెం, లింగ సముద్రం మీదుగా బలిజపాలెం, రామకష్ణాపురం వెంగళాపురం వద్దకు పాదయాత్ర కొనసాగింది. పెంట్రాల పం చాయితీ చీమలపెంట గ్రామస్తులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామంలోని రాళ్లపాడు రిజర్వాయర్ ఎడమ కాలువ ద్వారా 10గ్రామాల పరిధిలో సుమారు 4వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. వైసిపి పభుత్వం రిజర్వాయర్ కు సంబంధించిన ఎడమ కాలువ గేటు మరమ్మతులు చేయలేదని తెలిపారు. కాలువకు అవసరమైన పూడికతీత పనులు కూడా ఏమీ చేపట్టలేదన్నారు. ఏ పని చేసినా ఆ భారాన్ని రైతులపై మోపి ఇబ్బందిపెడుతుందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కాలువ మరమ్మతులు, పూడికతీత పనులు నిర్వహించాలని కోరారు. నారా లోకేష్ స్పందిస్తూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. జగన్ సర్కారు నిర్లక్ష్యం కారణంగా అన్నమయ్య డ్యామ్, పులిచింతల గేట్లు, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయాయన్నారు. గత టిడిపి హయాంలో ఇరిగేషన్ పై రూ.68,294 కోట్లు ఖర్చుచేశామన్నారు. చిన్ననీటి వనరుల అభివద్ధికి నీరు-ప్రగతి కింద 18,265 కోట్లు వెచ్చించాం. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాళ్లపాడు రిజర్వాయర్ ఎడమకాలువ గేట్ల నిర్మాణం చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాలువల మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టి రైతుల కష్టాలు తీరుస్తామని లోకేష్ చెప్పారు. ఈ పాదయాత్రలో అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి మాజీ ఎంఎల్‌ఎలు దామచర్ల జనార్ధన్, పోతుల రామారావు, దిశి శివరాం. అశోక్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నేత నూకసాని బాలాజీ యువ నాయకులు ఇంటూరి రాజేష్, దామచర్ల సత్య పాల్గొన్నారు.



భారీ గజమాలతో నారా లోకేష్, ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

నిర్మాణ పనులు పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు : జగనన్న కాలనీ లే అవుట్లలో అవస రమైన మౌలిక సదుపాయాలు, ఇతర వసతులను కల్పించేందుకు అదనపు కార్మికులతో నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులను ఎపి గృహ నిర్మాణ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శివప్రసాద్ ఆదేశించారు. శనివారం కార్పొరేషన్ కార్యాల యంలోని ఎపిజె అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో జిల్లా పరిధిలోని అన్ని లే అవుట్లలోని జగనన్న కాలనీ నిర్మాణాలపై కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఎపి గృహ నిర్మాణ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ వందశాతం నిర్మాణ పనులు పూర్తయిన గహాలను వెంటనే లబ్ధిదారులకు అందజే యాలని సూచించారు. లోన్ తీసుకునేందుకు అర్హులైన లబ్ధి దారులకు రుణాల మంజూరును సులభతరం చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో కావలి, కందుకూరు, ఆత్మకూరు, బుచ్చి హౌసింగ్ కార్పొరేషన్ ఈ.ఈ, డి.ఈ, ఏ.ఈలు, కాంట్రాక్టర్లు, నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయం ఎమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

'టిఆర్ఆర్' విద్యార్థుల జయకేతనం

ప్రజాశక్తి-కందుకూరు : బిఇడి, పిజీ సెట్ పరీక్షా ఫలితాల్లో కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్ తెలిపారు. బిఇడి ఇంగ్లీష్‌లో ఇట్టా సింధుజ రాష్ట్రస్థాయిలో 47వ ర్యాంకు, కె.శాంసన్ 108వ ర్యాంకు సాధించారు. ఇంగ్లీష్ పిజీ సెట్‌లో శాంసన్ 103 ర్యాంకు, ఎకనామిక్స్‌లో వై. సుధీర్ 190వ ర్యాంకు జివాలజీ లో అలెన్ చేరిష్టనా 300 ర్యాంకు సాధించారని తెలిపారు. ఇంకా తమ విద్యార్థులు అనేకమంది లైఫ్ సైన్సెస్, ఎక నామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ విభాగాల్లో 500 లోపు ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ విద్యార్థులందరికీ మంచి విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యనుఅభ్యసించే అవకాశం వస్తుందన్నారు. అధ్యాపకులందరూ ఈ విద్యార్థులను అభినందించారు. టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఉండే నైపుణ్యాలను మెరుగుపరిచి వారి యొక్క బంగారు భవిష్యత్తుకి బాటలు వేస్తుందని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. కందుకూరు, పరిసర ప్రాంతాల విద్యార్థిని విద్యార్థులు ఈ కళాశాలలో చేరి తమ భవిష్యత్తుకు భరోసా ఏర్పరచు కోవాలని ఆయన తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరం డిగ్రీలో చేరడానికి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ గడువు ఈనెల17వ తేదీతో ముగుస్తుందని తెలిపారు.



సిఐకి అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : నూతనంగా వచ్చిన కందుకూరు సిఐ నఫీజ్ బాషాని వక్ఫ్ బోర్డు సభ్యులు సందాని బాషా , ముస్లిం డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ ముస్తఫా , వైస్ ప్రెసిడెంట్ నసీర్ మర్యాదపూర్వకం శనివారం కలిశారు. పట్టణ విషయాలపై వారు చర్చించారు.

ఎంబిఎ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -గుడ్లూరు : ఎంబిఎ విద్యార్థి ఆత్మహత్య మండలంలో కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు మండలంలోని చెంచిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఎంబిఎ చదువుతున్న ఉదయ్ కుమార్ రెడ్డి (21) ఎంబిఎ చదవుతున్నారు. చదువు కొనసాగించడం కోసం ఆర్థిక స్థోమత లేకపోవడంతో మనస్థాపం చెందాడు. డబ్బులు కోసం తల్లిదండ్రులు పడుతున్న అవస్థలను చూసి మనస్థాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయ్ కుమార్ రెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న గుడ్లూరు సిఐ సుబ్బారావు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

అన్నదాతల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :అన్నదాతల అభ్యున్నతే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా (పిఏ సిఎస్)ల లక్ష్యమని జిల్లా సహకార శాఖ అధికారి బి. సుధాభారతి పేర్కొన్నారు. శనివారం ఆమె తోటపల్లిగూడూరు పిఎసిఎస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.సుధాభారతి మాట్లాడుతూ పిఎసిఎస్ కార్యకలాపాలలో పార దర్శకత, జవాబుదారీతనం ఎక్కువగా ఉంటుందన్నారు. సబ్ డివిజనల్ ఆఫీసర్ కె.వి రమణయ్య, సొసైటీ ఇంచార్జ్ సిఇఒ ఇ. వరప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ సునీల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

'కాకాణి' చొరవతో బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - పొదలకూరు

పొదలకూరు పంచాయతీ పరిధిలోని లింగంపల్లి హరిజవాడలో రైతులకు తోటల్లో బోర్లు లేక సేద్యానికి ఇబ్బందులు పడుతు న్నారు. దీనిపై ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి దష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే 'జలకళ' ధ్వారా 27 బోర్లను మంజూరు చేయిం చారు. 27 బోర్లను వేశారు. ఈ బోర్లలో నీరు కూడా సంవద్ధిగా పడటంతో రైతులు హర్షం వ్యక్త చేశారు. ఈ నేపథ్యంలో శని వారం మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిసి కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఉపసర్పంచ్ వాకాటి శ్రీని వాసు లురెడ్డి నాయకులు అనుమాల వెంకట్రామిరెడ్డి, పొదలకూరు ఎంపిటిసి-4 శ్రీనివాసులు ,శ్రీనాథ్ రెడ్డి, దూడల రమణా రెడ్డి మారుపుటి సుబ్రహ్మణ్యం, ఓజిలి వెంకట కష్ణారెడ్డి, ఓజిలి సుధాకర్ రెడ్డి,గుండ్ర రవికుమార్ రెడ్డి,గుండ్రా శ్రీనివాసులు రెడ్డి,కైతే పల్లి రాంబాబు,తూపిలి విజయ శ్రీనివాసులు రెడ్డి, దూడల శ్రీకాంత్ రెడ్డి, మనోహర్, రవి, కొంగి లక్ష్మయ్య, గుంటి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ 'మానుగుంట' కక్షగట్టి వేధిస్తున్నారు..

-భూములు లాక్కొని తప్పుడు కేసులు బనాయించారు.. -నారా లోకేష్ ఎదుట లింగసముద్రం దళితుల ఆవేదన

ప్రజాశక్తి -లింగసముద్రం

మేము తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులమన్న కక్షతో ఎంఎల్‌ఎ మహీధర్ రెడ్డి మమ్మల్ని పనిగట్టుకుని వేధిస్తున్నారు.. మాకు ఇచ్చిన పట్టాలను రద్దుచేయించారు. అదేమని ప్రశ్నించినందుకు తమపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బం దులకు గురిచేస్తున్నారు' అని లింగసముద్రం దళితులు యువనేత లోకేష్ ఎదుట వాపోయారు. యువగళం పాతయాత్రలో లింగసముద్రం వచ్చిన లోకేష్‌కు దళిత నాయకుడు గాలంకి ప్రసాద్ నేతత్వంలో బాధిత దళితులు యువనేత లోకేష్‌ను కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. 2015లో గత టిడిపి ప్రభుత్వం లింగసముద్రం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.3-8లో వనం-మనం పథకం కింద ఒక్కొక్కరికి 1.40 సెంట్ల చొప్పున 120మంది దళితులకు చెట్టు పట్టాలు ఇచ్చారని, అందులో మేము మామిడి మొక్కలు వేసి సంరక్షించు కుంటున్నామని తెలిపారు. 2019లో ప్రభుత్వం మారగానే తమ చెట్టు పట్టాలను రద్దుచేశారని తెలిపారు. హైకోర్టుకు వెళ్లగా మాకు అనుకూలంగా తీర్పువచ్చిందన్నారు. తాము టిడిపి సానుభూతిపరులమని కక్షగట్టి ఎంఎల్‌ఎ మహీధర్ రెడ్డి ఒత్తిడితో తహశీల్దార్ తమకు పట్టాలు ఇచ్చిన ప్రాంతంలో చెట్లు లేవని నివేదిక పంపారన్నారు. దీనిపై మేము నిరసన తెలపడానికి ప్రయత్నించగా అరెస్టు చేసి 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. తమ ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఆరునెలలపాటు స్టేషన్‌లోనే ఉంచారన్నారు. ఎంఎల్‌ఎ అరాచకాల నుంచి తమకు రక్షణ కల్పించి, మా భూములు, చెట్లు మాకు దక్కేవిధంగా సహకారం అందించాలని వారు కోరారు. దీనిపై నారా లోకేష్ స్పందిస్తూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక దళితులపై తీవ్రమైన అణచివేత చర్యలకు పాల్పడుతున్నారు. ఎపి చరిత్రలో తొలిసారిగా దళితుల భూమి విస్తీర్ణం తగ్గిపోయిందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. దళితులకు చెందిన 12వేల ఎకరాల అసైన్డ్ భూములను జగన్ ప్రభుత్వం బలవంతంగా లాగేసు కుందన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించిన దళితులపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. దళితులకు చెందాల్సిన రూ.28,147 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి తీరని అన్యాయం చేశారన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లింగసముద్రం దళితుల భూమిని వారికి అప్పగించేలా చర్యలు తీసుకుంటాం.. దళితులపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తేస్తాం. దళితులను పనిగట్టుకుని వేధించిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.



లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

'నారాయణ'లో

సామాన్యులకు అందుబాటులో ప్లాస్టిక్ సర్జరీ సేవలు

ప్రజాశక్తి-నెల్లూరు: నారాయణ వైద్యశాలలో ఆరోగ్య శ్రీ పథకం కింద సామాన్యులకు సైతం ప్లాస్టిక్ సర్జరీ సేవలను అందిస్తున్నట్లు ఆ వైద్యశాల మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ బి. హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నారాయణ వైద్యశాలలోని మెడికల్ సూపరింటిండెంట్ ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తమ వైద్యశాలలో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో డాక్టర్ శ్రీలక్ష్మి నేతృత్వంలో ప్రత్యేక బృందం ఈ చికిత్సలను సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. ఆ వైద్యబృందం నిర్వహించిన చికిత్సలతో స్వస్థత పొంది ఇక్కడకు వచ్చినవారే అందుకు నిదర్శనమన్నారు. నారాయణ హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో యాక్సిడెంట్ కేసులు, విద్యుత షాక్ గుర్రై శరీరం కాలిన గాయాలకు చికిత్సలు, లైపోసక్షన్ సర్జరీలు, రక్తనాళాలు, నరాలను తిరిగి అతికించే సర్జరీలు, చిన్నపిల్లల్లో పుట్టకతో వచ్చే గ్రహణమొర్రి వంటి సమస్యలకు చికిత్సలు అందిస్తున్నామన్నారు. అత్యంత అధునాతన పరికరాలు, నిష్ణాతులైన వైద్య బందంతోపాటు యాజమాన్యం సహకారంతో పేదలు ప్లాస్టిక్ సర్జరీ సేవలు పొందుతున్నారని తెలిపారు. కోట పరిసర ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాద వశాత్తు చెట్లను కోసే రంపం మిషన్ రెండు కాళ్లపై పడి నరాలు తెగి తీవ్రమైన రక్త స్రావంతో చికిత్సల నిమిత్తం నారాయణ అత్యవసర విభాగంలో చేరారన్నారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కుడి, ఎడమ కాళ్ల కండరాలు, నరాలు, రక్తనాళాలు బాగా దెబ్బతిన్నట్లు గుర్తించి వెంటనే ప్లాస్టిక్ సర్జరీ విధానంతో కుడి కాలికి ఆపరేషన్ చేశామన్నారు. ఆ తరువాత ఎడమ కాలికి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం ఆ వ్యక్తి పూర్తి ఆరోగ్యవంతుడిగా కోలుకుని మునపటిలాగే ఎవరి సహాయం లేకుండా నడుస్తున్నారన్నారు. ప్రమాదవశాత్తు ఇనుప రేకు చేతిపై పడి పూర్తిగా తెగిపోయి చికిత్సల నిమిత్తం నారాయణ అత్యవసర విభాగానికి చేరుకున్న మరో వ్యక్తి సైతం ఇదే తరహాలో ప్లాస్టిక్ సర్జరీ విధానంలో చికిత్సలు చేయగా మునపటిలా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ చికిత్సలు ఆరోగ్య శ్రీ లో పూర్తిగా ఉచితంగా చేశామన్నారు. ఈ రెండు శస్త్ర చికిత్సలు మత్తు వైద్య నిపుణులు డాక్టర్ ప్రభావతి ఆధ్వర్యంలో ఎటువంటి సమస్యలు లేకుండా పూర్తి చేశామన్నారు. డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పద్ధతులు అనుసరించి శస్త్ర చికిత్సల సమయంలో మత్తు మందు వినియోగిం చడం ద్వారా రోగికి ఎటువంటి దుష్ఫలితాలు ఉండవని తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి

వలంటీర్లపై ఆరోపణలు సరికాదు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ప్రజలకు సేవలందిస్తున్న వాలంటీర్లపై జనసేన నాయకులు, మాజీ సీఎం చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను వైసిపి రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి ఖండించారు. శనివారం తోటపల్లిగూడూరు మండలం పోట్లపూడిలో జగనన్న సురక్ష శిబిరం జరిగింది. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తమ సేవలతో వలంటీర్లు ప్రజల మనస్సులను గెలుచుకున్నరన్నారు. కోవిడ్ సమయంలో వాలంటీర్లు అందించిన సేవలు అభినందనీయమని సుధీర్ రెడ్డి కొనియాడారు. జెడ్పిటిసి శేషమ్మ, వ్యవసాయ సలహా మండలి చైర్పర్సన్ ప్రసూనా, ఎంపీటీసీ శీనయ్య, మండల వైస్ ప్రెసిడెంట్ ఇందిరమ్మ, ఎంపీడీవో హేమలత, తహసిల్దార్ హమీద్, ఈవోపీఆర్ రెడ్డి నారాయణరెడ్డి, ఆర్ఐ సునీల్ రెడ్డి ఉన్నారు.

నేడు మహిళా పోరు యాత్ర

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలో ఐద్వా ఆధ్వర్యాన మహిళా పోరుయాత్ర జాతా జరుగు తుందని సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజాలు తెలిపారు. ఈ జాతాకు మహిళలను సమీకరించేందు కోసం శనివారం వారు మండలంలో పర్యటించారు. వెంకయ్య, రాజా మాట్లాడుతూ మత్తు పదార్థాలను నిషేధించాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా ఆధ్వర్యంలో మహిళా పోరు యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఈ నెల 16, 17, 18 తేదీలలో మహిళా పోరుయాత్ర జాతా జిల్లాలో పర్యటిస్తుందనితెలిపారు. జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సిఐటియు కార్యాలయం నుండి నరకూరు సెంటర్ వరకు మహిళల ర్యాలీ వుంటుందన్నారు. ర్యాలీ తరువాత సభ జరుగుతుందన్నారు. ఈ ర్యాలీ, సభ ను జయప్రదం చేయాలని వెంకయ్య, రాజా కోరారు.

సచివాలయంలో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు : జగనన్న సురక్ష కార్యక్రమ ఏర్పాట్లను అన్ని సచివాలయాల్లో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, జగనన్న సురక్ష పథకం పారదర్శకంగా అందరికీ చేరువయ్యేలా సచివాలయం సెక్రెటరీలు కషి చెయ్యాలి అని కమిషనర్ సూచించారు. శనివారం నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 8/1, 8/2 ముకుందాపురం, సిఆర్‌పి డొంక వార్డు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సచివాలయాల్లోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయాల కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. స్థానిక కార్పొరేటర్, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పంపిణీ

నెల్లూరు : ప్రజా సమస్యలకు సంతప్తికర స్థాయిలో పరిష్కారం అంది ంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన "జగనన్న సురక్ష" పథకంతో అర్హులందరికీ సంక్షేమం సాధ్యమని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పొందాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. స్థానిక రూరల్ నియోజకవర్గం పరిధిలోని 19, 30వ డివిజనుల్లోని హరనాథపురం, తదితర ప్రాంతాల్లోని సచివాలయాలు, నగర నియోజకవర్గం పరిధిలోని 7, 48, 49 డివిజనుల్లోని స్టోన్ హౌస్ పేట, మూలాపేట, కోటమిట్ట, చిన్న బజార్ ప్రాంతాల్లోని సచివాలయాల్లో శనివారం ప్రారంభించిన జగనన్న సురక్ష పథకంలో భాగంగా కమిషనర్ పాల్గొని మంజూరు చేసిన టోకన్ల ఆధారంగా లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలు అందచేశారు.

మాదక ద్రవ్యాల నివారణకు చర్యలు : ఎస్పి

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆశ యాలకు అనుగుణంగా జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా రూపొం దించడమే ప్రధాన లక్ష్యంగా ప్రణాళి కబద్ధంగా పటిష్టమైన ప్రణాళికలు రూపొం దించుకొని ఆ దిశగా పోలీసు సిబ్బంది పక్కాగా విధులు నిర్వహి ంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం. హరినారాయణ్ ఎస్పి డాక్టర్ కె. తిరుమలేశ్వరరెడ్డికి సూచించారు. శనివారం ఎస్పి కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ పద్ధతిలో నార్కోటిక్ కో ఆర్డినేషన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్, ఎస్పి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం కలిగే అనర్థాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని, వాటిపై పోలీ సులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్పి డాక్టర్ కె. తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడారు. ఇంకా ఎన్‌సిఒఆర్‌డి కమిటీ స్టేక్ హోల్డర్స్ మాట్లాడుతూ వారివారి సలహాలు, సూచనలు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-మర్రిపాడు



మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం జరిగిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. నవ్యశ్రీ, ఆశాస్, చంద్రికలకు వేమన ఓబయ్య, ఆయన భార్య జయరత్నమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్యాంప్రసాద్, సురేష్, కిషోర్ రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేల వంతున నగదు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి విద్యార్థులను ప్రోత్సహించడం శుభపరిణామన్నారు. నగదు ప్రోత్సాహకాలు అందజేసిన వేమన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. వేమన శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని, చదువులో ముందంజలో ఉండే విద్యార్థులకు సహకారాన్ని అందించడానికి తాము ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటామని, ఈ పాఠశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ జొన్నా సత్యనారాయణ, ఇరుకుమాలెం మురళీధర్ రావు, పెనుమాడ వెంకటరత్నం, వేమన విజయ రాఘవులు, వేమన మురళి, వేమన బాలాజీ, వినాయక రెడ్డి, కలిశెట్టి రాజేంద్రకుమార్, కర్నూలు రమణయ్య, కొండెద్ది నరసారెడ్డి, తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు



ప్రజాశక్తి-నెల్లూరు : మాగుంట లేఅవుట్‌లో వెలసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామిని టిడిపి నాయకులు శనివారం దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలియజేశారు. జిల్లాలో ఇన్‌ఛార్జులు గానీ, శాసనసభ్యులుగాని మాజీ మంత్రులు గానీ లోకేష్ పాదయాత్రను విజయవంతం చేసినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. ఆదేవిధంగా జిల్లా ప్రజలు లోకేష్‌బాబుకి పాదయాత్రలో సంఘీభావం తెలిపి ఆయనతో నడిచినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. శ్రీమన్నారాయణ శ్రీ వెంకటేశ్వర స్వామిని మనస్ఫూర్తిగా టిడిపి నాయకులు, కార్యకర్తలను కాపాడాలని కోరుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి విచ్చలవిడిగా మద్యం షాపులు పెంచుతూ ఇసుక మాఫియాని ప్రోత్సహించి ఆ వచ్చిన డబ్బులతో పెన్షను ఇస్తున్నట్లు తెలిపారు. అయితే ఇచ్చే సంక్షేమ పథకాలను రాష్ట్రం ఇచ్చినట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు సిలిండర్లు మహాశక్తి 11వ ద్వారా మహిళలకు అనేక పథకాలు స్త్రీమాని ప్రకటించిన వెంటనే ఉలిక్కిపడుతున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, యువతకు ఉద్యోగాలు ఇవ్వడం ఖాయమని, చెప్పిన హామీలను నెరవేర్చడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి నాయకులు శివాజీరావు, రాష్ట్ర కార్యదర్శి జెని రమణయ్య, తెలిసి పత్యాయకులు, శ్రీనాథ్, రమేష్, నాయుడు, 25వ డివిజన్ అధ్యక్షులు కరిముల్లా, కల్లూరుపల్లి బాబు పాల్గొన్నారు.

నేడు 'నా ఫౌండేషన్' అవార్డులు అందజేత

ప్రజాశక్తి-కావలి : ప్రముఖ రచయిత వి.వి.న. మూర్తికి 'నా' ఫౌండేషన్ లిటరరీ అవార్డు బహూకరణ సభ స్థానిక ఇంద్రావతమ్మ కాలనీ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు 'నా' ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేబాకుల సుధాకర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ సభకు ముఖ్యఅతిథిగా 'మనసు' ఫౌండేషన్ నిర్వాహకులు మన్నం వెంకటరాయుడు, సభాధ్యక్షులుగా ఆర్టిస్ట్, రచయిత పొనుగోటి కృష్ణారెడ్డి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ కార్యదర్శి, సాహితీ విమర్శకులు పెనుగొండ లక్ష్మీ నారాయణ రచించిన 'విచేతన' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి వక్తలుగా అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ రచయిత వల్లూరి శివ ప్రసాద్, రచయిత, జర్నలిస్ట్ గంగిశెట్టి శివకుమార్ పాల్గొంటారని వివరించారు. కనుక కావలి పట్టణంలోని మేధావులు, రచయితలు, సాహితీ అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని లేబాకుల సుధాకర్ రెడ్డి తన ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఐదుగురు సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

- 23 సెల్‌ఫోన్లు స్వాధీనం



ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ పరిధిలోని ముసునూరు మాగుంట పార్వతమ్మ గెస్ట్‌హౌస్ సమీపంలో ఐదుగురు సెల్‌ఫోన్ దొంగతనాల నేరస్తులు గుర్రం కొండ సాల్మన్, మల్లి పుల్లేశ్వరరావు, కట్టా మనోహర్, చెన్నంశెట్టి కుమార్, పాలిశెట్టి సుబ్రహ్మణ్యంలను రూరల్ సి.ఐ. రాజేష్, అతని సిబ్బంది అరెస్ట్ చేసినట్లు కావలి డి.ఎస్.పి. వెంకటరమణ తెలిపారు. శనివారం డిఎస్‌పి కార్యాలయంలో ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుల నుండి రూ.6లక్షలు విలువైన 23 వివిధ కంపెనీలకు చెందిన సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు నిందితులు పాత నేరస్తులు అని వివరించారు. రూరల్ సి.ఐ. నరేంద్ర, ఎస్.ఐ. సుమన్ పాల్గొన్నారు.

మృతి చెందిన జింకకు పంచనామా

ప్రజాశక్తి-ఉదయగిరి : మృతి చెందిన అడవి జింకకు అటవీశాఖ అధికారులు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పంచనామా నిర్వహించి దహనం చేశారు. శనివారం స్థానిక పట్టణంలోని దిలావర్‌భాయి వీధిలో రెండు జింకలు అటవీ నుండి తప్పించుకుని నీటి కోసం శివారు ప్రాంతంలో ఉన్న ఖర్ల ప్రక్కను రావడంతో వీధి కుక్కలు వెంబడించి ఒక జింకను పూర్తిగా గాయపరచడంతో, మరో జింకను స్థానిక యువకులు కాపాడారు. గాయపడిన జింకకు నీరు తాగించి సంబంధిత శాఖ సిబ్బందికి ఇవ్వడంతో అటవీ శాఖ సిబ్బంది జింకను రక్షించి ప్రథమ చికిత్స అందించారు. ఒక జింక చికిత్స పొందుతూ మరణించడంతో పంచనామా నిర్వహించి దహనం చేసి ఒక జింకను అడవిలో వదిలేశారు.

ఆగిన లారీలను ఢీకొన్న సిమెంట్ ట్యాంకర్

ప్రజాశక్తి-సంగం : ఆగి ఉన్న రెండు లారీలను నెల్లూరు వైపు నుండి తాడిపత్రి వైపు వెళ్తున్న ఓ సిమెంట్ ట్యాంకర్ ప్రమాదవశాత్తు ఢీకొన్న ఘటన సంగం చెక్‌పోస్ట్ సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ రోడ్డు ప్రమాదంలో లారీలు పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యాయి. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జున రెడ్డి వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని రహదారిపై ట్రాఫిక్ అంతరాయం జరగకుండా చర్యలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని హసనాపురం గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఎస్‌ఐ షేక్ నజీర్ అహ్మద్ తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. హసనాపురం గ్రామానికి చెందిన కల్లూరి సురేష్, షేక్ మొహమ్మద్ హనీఫ్, నాగిరెడ్డి వెంకటకృష్ణారెడ్డిలు శుక్రవారం సురేష్‌ను గ్రామంలోని ఓ దుకాణం వద్దకు పిలిచి రూ.1000 డబ్బులు ఇవ్వమనీ బెదిరించి లేకపోతే నిన్ను చంపేస్తామని బలవంతంగా డబ్బులు లాక్కొని వెళ్లారని, బాధితుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎఎస్ఐ షేక్ నజీర్‌అహ్మద్ నిందితులను అరెస్టు చేశారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన ఎఎస్‌ఐను డిఎస్‌పి, సిఐలు అభినందించారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష'



మాట్లాడుతున్న సిహెచ్ ఆదిశేషయ్య

ప్రజాశక్తి-ఆత్మకూరురూరల్ : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు పురపాలక పరిధిలోని మెప్మా ఆఫీసు సచివాలయం పరిధిలో 7, 8, 9 వార్డుల్లో మున్సిపల్ ఛైర్పర్సన్ గోపారం వెంకటరమణమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య మాట్లాడుతూ పేదలకు లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష ద్వారా పలు రకాల సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అవసరమైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ గంగాప్రసాద్, వైస్ చైర్మన్ షేక్.సర్దార్, పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, సయ్యద్ నౌషాద్ బేగం, పుచ్చలపల్లి రాధిక, కొండా వెంకటేశ్వర్లు, కొప్పోలు చిన్నపరెడ్డి, సయ్యద్‌జమీర్, తదితరులున్నారు.



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి 11 రకాల సేవలను అందజేస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కేతా వేణుగోపాల్ రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని కరటంపాడు సచివాలయంలో ఎంపిపి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం వైసిపి నాయకులు వల్లవ నేని రాజేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి నూటికి నూరు శాతం అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్, సర్పంచ్ పూను గుంట రేవతి, ఎంపిటిసి ఖాసీం, తహశీల్దార్ లక్ష్మీ నరసింహ, విఆర్ఒ ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు 544 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం ఎంపిడిఒ మల్లికార్జున అందజేశారు. శనివారం ఉదయగిరి బిట్ -1 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మల్లికార్జున మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఎటువంటి రుసుం చెల్లించకుండా 544 మంది లబ్ధిదారులకు 11 సర్వీస్ కింద మంజూరైన ధ్రువపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో డిటి సిహెచ్ శ్యామ్, ఎంపిటిసి పెద్ద మస్తాన్, ఇఒపిఆర్‌డి నరసయ్య, మండల కోఆప్షన్ సభ్యులు సుభాని పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని అగ్రహారం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహశీల్దార్ పి. నరసింహం, ఎంపిడిఒ మధుసూదన్‌రావు నిర్వహించారు. వలంటీర్ల ద్వారా ప్రజలకు అవసరమైన 11రకాల ధ్రువీకరణ పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపిపి పేయ్యల సంపూర్ణమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ అఖిల్‌రెడ్డి, అంకిరెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపిటిసి కొండారెడ్డి, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : జగనన్న సురక్ష పథకంలో లబ్ధి పొందేందుకు అర్హత ఒక్కటే ప్రామాణికమని మండల ఉపాధ్యక్షులు వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు పాలవల్లి మాలకొండారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అన్నవరంలో జగనన్న సురక్ష కార్యక్రమం స్థానిక సర్పంచ్ గుమ్మిడి మార్తమ్మ, గోపనపాలెం సర్పంచ్ గండు వెంకారెడ్డిల అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ పద్మావతి, ఎపిఒ శ్యామల, వ్యవసాయ అధికారిణి శైలజ, మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇంద్రమ్మ, ఎంపిటిసి కోర్సుపాటి మహదేవ రెడ్డి, వైసిపి నాయకులు గుమ్మిడి రమేష్, ఏఈఓ మునెమ్మ, పంచాయతీ కార్యదర్శులు జె రేవతి, మౌనిక, విఆర్ఒ కె శివకుమార్, మండల రైతు అధ్యక్షులు గండు కృష్ణారెడ్డి, అన్నవరం సచివాలయం కన్వీనర్లు దామెర్ల దేవదాసు, ఆలూరిలక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు.

బ్రాహ్మణక్రాకలో... శనివారం సర్పంచ్ ఇండ్ల సుధాకర్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్‌బాబు జగనన్న సురక్ష కార్యక్రమం విశిష్టతను వివరించారు. ఎంపిడిఒ శ్రీధర్ బాబు చేతుల మీదుగా అర్హత కలిగిన లబ్ధిదారులకు పలు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌బికెఎస్ ఏఈఓ సతీష్ బాబు, ఎపిఎం శ్రీధర్ రావు, పిఆర్‌ఎఇ వాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దగదర్తి : మండలంలోని చెన్నూరు పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం సచివాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పోలీస్ హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్, గృహసారథుల మండల అధ్యక్షులు పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందిస్తున్న నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ చెంచయ్య, ఎంపిడిఒ విజయకుమార్, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో వివాదం



ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని కాంచేరువు గ్రామంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వివాదం చోటుచేసుకుంది. తమ పంతమే నెగ్గాలంటూ వేదికను మార్చాలంటూ ఒక వర్గం, ఇక్కడే ఉండాలంటూ మరోవర్గం తమ పంతాన్ని నెగ్గించుకునేందుకు పోటీ పడగా పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. ఒక దశలో ఇద్దరి పంచాయతీ కార్యదర్శులు మౌలాలి, జిలానీలను ఒక వర్గం నాయకులు సచివాలయం గదిలో బంధించే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పి అధికారులు విధులకు హాజరయ్యేలా చూశారు. ఎట్టకేలకు సభ సజావుగానే జరిగింది. కార్యక్రమంలో తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపిడిఒ విజయభాస్కరరావు, ఎంపిపి గవద కట్ల వెంకటలక్ష్మమ్మ, వైసిపి ఎంపిపి చంచల మధు, సర్పంచులు మళ్లీశ్వరి, రమణమ్మ, నరసమ్మ, ఎంపిటిసి లక్ష్మమ్మ, అధికారులు పాల్గొన్నారు.

'ఆరోగ్యమే మహాభాగ్యం' : జెవివి

ప్రజాశక్తి-కావలి



ప్రజలు తీసుకునే ఆహారంలో నాణ్యత పాటించాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని జెవివి నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక 8వ వార్డు మున్సిపల్ హైస్కూల్ ఆవరణంలో జెవివి జిల్లా నాయకులు పాపిశెట్టి.జానకిరామ్ అధ్యక్షతన ప్రిజర్వేడ్ ఫుడ్స్ (జంక్ ఫుడ్స్) వల్ల కలిగే నష్టాలు, అదేవిధంగా తాజాగా తయారు చేసుకున్న హోమ్ ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే లాభాలు గురించి, ఆరోగ్య పరిరక్షణ- సీజనల్ వ్యాధులు గురించి ఈ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాపిశెట్టి. జానకిరామ్, విశ్రాంత ఎం.ఇ.ఒ. కల్లయ్యలు మాట్లాడుతూ విద్యార్థులు తినుబండారాలుగా ఉన్న కుర్కురేలు, పిజ్జాలు, బర్గర్లు, నూడిల్స్, స్పైసి ఫుడ్స్ మొదలైన జంక్ పదార్థాలు తీసుకుంటున్నారని, వీటిని ఎక్కువ కాలం నిల్వ చేసేందుకు వాడే కెమికల్స్ పిల్లలకు హానికరం చేస్తుందన్నారు. వీటికి బదులుగా ఇంట్లో తాజాగా వండే ఆహార పదార్థాలు తీసుకొని, ఆరోగ్యం పరిరక్షించుకోవాలని సూచించినారు. అదేవిధంగా రాబోయేది వర్షాకాలమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలుతాయన్నారు. ముందుగా విద్యార్థులు తీసుకోవాల్సిన మెళకువలు, జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో పట్టణ జెవివి కోశాధికారి టి.సుబ్బరామశర్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బయట అమ్మే జంక్‌ఫుడ్ కాకుండా అమ్మచేతి వంటనే తినాలన్నారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై 10మంది విద్యార్థులు ఇంగ్లీషులో అనర్గళంగా ఉపన్యసించారు. మరో నలుగురు విద్యార్థులు కమ్మగా పాటలు పాడి, అలరించారు. వారందరికీ సైన్స్ సంబంధిత పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మి పావని, జెవివి పట్టణ ఉపాధ్యక్షులు కందికట్టు.నారాయణ, జె.వి.వి.సీనియర్ సభ్యులు కె.జాన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల సేవలు వెలకట్టలేనివి..



ప్రజాశక్తి-జలదంకి : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య పనిచేస్తున్న అధికారుల సేవలు వెలకట్టలేనివి అని పాలవల్లి మాలకొండారెడ్డి అన్నారు. పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తూ బదిలీపై వెళ్లిన రామకృష్ణాతో పాటు సచివాలయం సిబ్బంది అయిన గోపనపాలెం కార్యదర్శి రామ్‌చరణ్, అన్నవరం డిజిటల్ అసిస్టెంట్ ఆర్.నరేంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.మానసాలకు వాలంటీర్ల ఆధ్వర్యంలో శనివారం అన్నవరం సచివాలయంలో సన్మానం నిర్వహించారు. అన్నవరం, గోపన పాలెం సర్పంచులు గుమ్మిడి మార్తమ్మ, గండు వెంకారెడ్డిలు అధికారుల సేవలను గుర్తిస్తూ వారిని అభినందించారు. కార్యక్రమంలో అన్నవరం, గోపనపాలెం పంచాయతీ కార్యదర్శులు జె రేవతి, మౌనిక, ఎంపిటిసి కోర్సుపాటి మహదేవ రెడ్డి, వైసిపి మండల రైతు అధ్యక్షులు గండు కృష్ణారెడ్డి, అన్నవరం సచివాలయం కన్వీనర్లు దామెర్ల దేవదాసు, ఆలూరి లక్ష్మీనరసారెడ్డి, విఆర్ఒ కె.శివకుమార్, విఆర్ఎలు, మల్లికార్జున, మోహన్ బాబులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒలతో సమీక్ష

ప్రజాశక్తి-సంగం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం బిఎల్‌ఒలతో తహశీల్దార్ అశోక్, డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. 21వతేదీ నుండి ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రతీ ఇంట్లో ఓటరు కార్డులో తప్పొప్పులను సవరించాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహిళలపై నిర్లక్ష్యం తగదు

- పోరుయాత్ర జయప్రదానికి ఐద్వా పిలుపు

ప్రజాశక్తి-మర్రిపాడు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై హింస విపరీతంగా పెరిగిపోయాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిని వీడి చర్యలు తీసుకోవాలని ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు శ్యామలమ్మ, మూలి ప్రమీల డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో 17న మర్రిపాడులో జరిగే మహిళల పోరు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. యువత మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని నైతిక విలువలు మరచి అత్యాచారాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మద్యం, మత్తు పదార్థాలను నిషేధించి మహిళలకు చిన్నాలకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను ఫాస్ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన విచారించి కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే హింస అశ్లీలత అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు టీవీ సీరియల్స్ ఇంటర్నెట్ కార్యక్రమాలు వెబ్‌సిరీస్ చిత్రాలను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా గ్రామకార్యదర్శి ఖాసింబీ, తదితరులున్నారు.

మట్టి మాఫియాను అరికట్టండి : సిపిఎం

ప్రజాశక్తి-కోవూరు



నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

పోతిరెడ్డిపాలెం పెన్నానదిలో మట్టి మాఫియా ను అరికట్టాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత 50 ఏళ్ల నుండి ఆకుకూరలు పండించి పేదప్రజలు పొట్ట పోసుకుంటున్న భూముల్లో అర్ధరాత్రి 11 గంటలపైన మట్టి మాఫియా రెచ్చిపోతుందన్నారు. ప్రొక్లైన్లు పెట్టి సుమారు 40 ట్రాక్టర్లతో చుట్టుపక్కల గ్రామాల ప్రజానీకానికి నిద్ర లేకుండా అర్ధరాత్రి అధికార వైసిపి అండదండలతో విచ్చలవిడిగా అమ్ముకుంటున్నా రని విమర్శించారు. పెన్నానది పొర్లు కట్టకు ఆనుకొని ఉన్న మట్టిని తొలగిచ్చేస్తే పెన్న వరద గతంలో లాగా మరోసారి తెగిపోయి పోతిరెడ్డి పాలెం, స్టవ్ బీడి కాలనీ, గంగవరం, కోవూరు, పడుగుపాడు, వెంకటేశ్వరపురం ప్రజలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అధికార పార్టీ ఈ ప్రమాదాన్ని సృష్టించడానికి విచ్చలవిడిగా మట్టి మాఫియాను ప్రోత్సహిస్తుం దని తెలిపారు. గతంలో జొన్నవాడ పైన మినగల్లు ప్రాంతంలో ఇసుక మాఫియా ఆగడాలకు పెన్నా నదిలో ఇసుక లోతు గుంతలు వల్ల పెన్నా నది కరకట్లు కోసుకుపోవడంతో బుచ్చి మండలం కోవూరు మండలం ప్రజలు వరద ముంపునకు గురై సర్వం కోల్పోయారన్నారు. మళ్లీ మరో ప్రమాదనికి శ్రీకారం చుడుతున్నారన్నారు. ప్రజలు ఇరిగేషన్ అధికారులుకు, రెవెన్యూ అధికారులుకు, పోలీసు అధికారులకు తెలియజేసినా అధికార పార్టీకి భజన చేసే ప్రయత్నంలోనే ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపించి తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం కోవూరు మండలం కమిటీ కోరుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య, పెద్దన్న బుజ్జియ్య, మోహన్, మణివర్మ, మస్తానయ్య, లీలమ్మ, రత్నమ్మ, సుబ్బమ్మ, మహమ్మద్ బాషా, వెంకయ్య, వేణు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణకు టిడిపి సంతాపం



ప్రజాశక్తి-కావలి : ప్రముఖ హైకోర్టు న్యాయవాది, టిడిపి సీనియర్ నాయకులు మువ్వల వెంకట నారాయణ శుక్రవారం మరణించగా, శనివారం ఆయన భౌతికకాయాన్ని కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, పార్టీ శ్రేణులతో కలిసి దర్శించి, పార్టీ జెండాను కప్పి, పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు జ్వాలా సుబ్రహ్మణ్యం, మన్నవ రవిచంద్ర, పోట్లూరు శ్రీనివాసులు, గుత్తికొండ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

'ఉపాధి' అవినీతిపై విచారణ

ప్రజాశక్తి-కొడవలూరు

తలమంచి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనుల్లో భారీగా అవినీతిపై కలెక్టర్ హరినారాయణ విచారించారు. శనివారం జిల్లా కలెక్టర్‌కు తలమంచి జొన్న శివకుమార్ చేసిన ఫిర్యాదుపై కలెక్టర్, డ్వామా కార్యాలయంలో అంబుడ్స్‌మెన్ వారిని విచారణ అధికారిగా నియమింపు చేశారు. సదరు విచారణ అనంతరం తలమంచి గ్రామపంచాయతీకి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ అధికారులైన ఎంపిడిఒ, ఎపిఒ, టెక్నికల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, తదితరులు అందరికీ కలిపి రూ.29 లక్షలను వారి వద్ద నుంచి రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

16న చలో 'హైదరాబాద్-సన్నాహక సభ'

ప్రజాశక్తి-కావలి

చలో హైద్రాబాద్ - సన్నాహక సభ పట్టణంలోని ముసునూరులోని మాతమ్మ గుడి దగ్గర జరుగుతుందని ఎం.ఆర్.పి.ఎస్. నాయకులు అక్కిలిగుంట యేసు, చెవూరు కిరణ్ కుమార్ మాదిగలు ప్రకటనలో తెలిపారు. ఎం.ఆర్.పి.ఎస్. వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్.సి. రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకు పోరాటం చేస్తున్న ఆయన నిర్వహిస్తున్న "చలో హైద్రాబాద్" కార్యక్రమం జయప్రదం చేసేందుకు ఏర్పాటు చేస్తున్న సన్నాహక సభను జయప్రదం చేయాలనీ వారు పిలుపునిచ్చారు.

నేడు ప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులను జేఆర్ పేటలోని వినాయక స్వామి మందిరంలో ఆదివారం అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు కంచి పరమేశ్వర్ రెడ్డి, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, నగదు బహుమతి దాత సోమవారపు యానాద్ రెడ్డి, తెలుగు భారత్ సేవాసమితి సలహాదారులు పాల్గొంటారు. కార్యక్రమం విజయవంతం చేయాలని తెలుగు భారతి సేవ సమితి అధ్యక్షులు ఎస్ సుబ్బరాయుడు, ఏపీ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకటన ద్వారా తెలియజేశారు.

'ప్రభుత్వ' విద్యార్థికి ట్రిపుల్‌ఐటి సీటు



ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి చాట్ల చరణ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం అనంతలక్ష్మి తెలియజేశారు. చాట్ల చరణ్ 550 మార్కులతో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచారు. చరణ్ శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలియజేశారు. ఈ మేరకు చరణ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి : రక్తదానం ఒక అందమైన బహుమతి అని రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. శనివారం ప్రముఖ రియల్టర్, మాజీ ఎఎంసి డైరెక్టర్ కాటా శ్రీనివాసులురెడ్డి జన్మదినం సందర్భంగా గుండెమడుగుల దేవదానం వ్యాపార సముదాయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ రక్తదానం కంటే విలువైన బహుమతి లేదన్నారు. కాటా శ్రీనివాసులురెడ్డి పలు దార్మిక సంస్థలకు విరాళాలు ఇవ్వడంతో పాటు, రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో కాంపోనెంట్ బ్లాక్ ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించారన్నారు. తమ వ్యాపారాల ద్వారా అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. పలు సేవా, సామాజిక సంస్థల ప్రతినిధులు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల సంతృప్తే ధ్యేయం

ప్రజాశక్తి-కావలి : ప్రయాణికుల సంతృప్తే ధ్యేయంగా పనితీరు మెరుగు పరచుకోవాలని జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకట శేషయ్య సూచించారు. శనివారం అయన కావలి డిపోను ఆకస్మికంగా సందర్శించి, పలు విభాగాలలో తనికీలు నిర్వహించారు. కావలి డిపోలోని గ్యారేజ్, ట్రాఫిక్ సెక్షన్, సరుకు రవాణా విభాగాలను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున డిపో పరిధిలోని అన్నీ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో ఉచిత, రాయితీ బస్సు పాసులను అందజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజారవాణాధికారి పి.వెంకటశేషయ్య గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అత్యధిక ఇందనపొదుపు సాధించిన డ్రైవర్లకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కెవిఆర్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎస్కె ఖాదర్ మొహిద్దీన్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, ఇతర డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో సమీక్ష

ప్రజాశక్తి-కావలి

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో నియోజక వర్గ పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర సమక్షంలో కావలి పట్టణ టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బూత్ లెవెల్‌లో ఓటర్ల ప్రక్రియపై పనిచేయని కన్వీనర్‌లను తొలగించి, నూతన బూత్ లెవెల్ కన్వీనర్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. 21వ తేదీ నుండి జరగబోయే ఎలక్టోరల్ రివిజన్ గురించి సన్నాహక అంశాలపై కాసేపు చర్చించారు. ఆర్‌టిఎస్, పార్లమెంట్ కోఆర్డినేటర్ గొట్టిపాటి మనోరమ, హౌస్ మ్యాపింగ్ కోఆర్డినేటర్ చిట్టాబత్తిన కార్తీక్ ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో నిర్వహించారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-నెల్లూరు

అంగన్‌వాడీల అపరిష్కృత సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 36 గంటల అంగన్‌వాడీల ధర్నాకు వేల సంఖ్యలో హాజరై వైసిపి ప్రభుత్వానికి తమ సత్తా చాటుకున్నారు. దేశంలో ఐసిడిఎస్ సంస్థ పరిధిలో 14 లక్షల అంగన్‌వాడీ సెంటర్లలో 25 లక్షల మంది 10 కోట్ల మందికి పోషకాహారం నిరంతరం అందజేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీస హక్కులు కల్పించకుండా రాజకీయ వేధింపులకు గురిచేయడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణులకు, బాలింతలకు, పసిబిడ్డలకు పోషకాహారం అందించే ఐసిడిఎస్ సంస్థను నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, ప్రయివేట్ సంస్థలకు కట్టబెట్టాలని ప్రయత్నం చేస్తుందంటూ అంగన్‌వాడీలు వాపోయారు. అందులో భాగంగా నిధులను కేటాయించకుండా కుట్రపూరితంగా వ్యవహరించడం ఎంత వరకు న్యాయమని వారు ప్రశ్నించారు. అటువంటి తరుణంలో ఐసిడిఎస్ సంస్థను పరిరక్షించుకొనేందుకు దేశ వ్యాప్తంగా 36 గంటల పాటు ధర్నా కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే తమ ఆందోళన తీవ్రతరం చేస్తామంటూ ప్రభుత్వానికి హెచ్చరికలు చేశారు. కలెక్టర్ ఎం.హరినారాయణ్ జిల్లా వ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తూ విద్యాసంవత్సరం ఆరంభం అవుతున్న నేపథ్యంలో బడిఈడి పిల్లలందరూ పాఠశాలలో ఉండాలని ఆ దిశగా విద్యాశాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యతోనే పేదరికం జయించవచ్చని, పేద విద్యార్థులకు మెరుగైన విద్యార్థి అందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని, ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోవాల్సిన పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలకు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నాడు-నేడుతో పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయని, తల్లులకు ఇబ్బందులు లేకుండా అమ్మఒడి, ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా విద్యా కానుక కిట్లు, జగనన్న గోరుముద్ద వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించి బడికి పంపిచే విధంగా చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని మినిబైపాస్ రోడ్డు ప్రాంతంలో నిర్మిస్తున్న టోల్‌ప్లాజా పనుల వర్క్ ఆర్డర్ ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరసన కార్యక్రమం స్థానిక సుందరయ్య కాలనీ సమీపంలోని జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సుందరయ్య కాలనీ ప్రాంతంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. అనంతరం సుందరయ్య కాలనీ, డిబ్లాక్ ప్రాంతంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేసిన ఎంపి ఆదాల ప్రభాకరెడ్డిని స్థానిక సిపిఎం శాఖ ఆధ్వర్యంలో ప్రజలు అడ్డుకున్నారు. నగర పరిధిలో టోల్‌ప్లాజా నిర్మించడం వల్ల ఎదురైయ్యే సమస్యలను ఎంపికి వివరించి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ నిర్మాణ పనులు నిలిపి వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి ఈ టోల్‌ప్లాజా నిర్మాణ పనులు నిలుపుదల చేస్తుందో లేదో వేచిచూడాల్సి ఉంది.

వీక్షణం